E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :309 శనివారం 17 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## రాహుల్‌పై ఆరోపణలు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు!



2 లో

- రాహుల్‌పై ఆరోపణలపై సుప్రీం స్పందన
- గర్భిణీ జర్నలిస్టును నెట్టివేశారని ఆరోపణలు
- మౌఖిక ఆరోపణలను పరిగణనలోకి తీసుకోలేము
- ఆధారాలతో పిటిషన్ దాఖలు చేయాలని సూచన
- బీజేపీ నేత గౌరవ్ భాటియా ప్రస్తావన
- ర్యాలీ సందర్భంగా తోపులాటపై వివాదం

## డీలిమిటేషన్‌పై కేంద్రం ఫోకస్!

- పార్లమెంట్‌కు ప్రత్యేక సెషన్?
- మహిళా రిజర్వేషన్‌పై మళ్లీ ఫోకస్
- బిల్లుల కోసం కేంద్రం కొత్త ప్లాన్
- ప్రత్యేక సమావేశాలకు రంగం సిద్ధం?
- రాజ్యాంగ సవరణ బిల్లులపై కదలిక
- బిల్లుల ఆమోదానికి కేంద్రం వ్యూహం
- ఈ నెలాఖరులో పార్లమెంట్ భేటీ?
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఉత్కంఠ



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలను తీవ్రతరం చేస్తున్న వేళ.. కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసుకోవడానికి అవసరమైన బలం తమకు ఉందని కేంద్ర ప్రభుత్వ అగ్రశ్రేణి వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సభలో తమకు పూర్తి బలం ఉందనే నమ్మకంతో ఉన్న ప్రభుత్వం.. ఈ ప్రతిపాదిత చట్టాలను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో, ఓటింగ్ జరిగే అవకాశం ఉండటంతో తమకు మద్దతును మరింత పెంచుకునేందుకు ప్రతిపక్ష పార్టీలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

గతంలో ఏప్రిల్ 17న ముగిసిన బడ్జెట్ సమావేశాల సమయంలో మోడీ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు దిగువ సభలో వీగిపోయింది.

2 లో

## ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీం హెచ్చరిక!

- వ్యాపారులకు నష్టం జరిగితే ఊరుకోం
- కనాట్ ప్లేస్ మూసివేతపై సుప్రీం ఆగ్రహం
- అక్రమ నష్టంపై పరిహారం చెల్లించేలా చర్యలు
- రోజుకు రూ.200 కోట్ల వ్యాపార నష్టం?
- పండుగ వేళ దుకాణాల మూసివేతపై ఆందోళన
- చిన్న వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం
- ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- అక్టోబర్ 26కు తదుపరి విచారణ వాయిదా

2 లో

## ధ్రువ్ రాఠీపై క్రిమినల్ కేసు!

- ఇంటి గేటుపై కోర్టు సమన్లు
- బీజేపీ ఐటీ సెల్ సభ్యుడి ఫిర్యాదు
- 2018 వీడియోతో మొదలైన వివాదం
- రూ.50 లక్షల ఆరోపణలపై కేసు
- 2019 నుంచి అందని కోర్టు నోటీసులు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నట్లు సమాచారం
- అక్టోబర్ 17న తదుపరి విచారణ



2 లో

**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి పరువు నష్టం కేసులో ఇబ్బందులు మరింత పెరిగాయి. గురుగ్రామ్‌లోని ఇంటి ప్రధాన గేటుపై ఢిల్లీ సాకేత్ కోర్టు సమన్లను అంటించారు. బీజేపీ ఐటీ సెల్ సభ్యుడు వికాస్ సాకృత్యాయన్ అలియాస్ వికాస్ పాండే దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసుకు సంబంధించి ఈ పరిణామం చోటుచేసుకుంది. గురుగ్రామ్‌లోని సెక్టార్-56 లో ఉన్న కేంద్రీయ విహార్ సొసైటీలో ఉన్న ధ్రువ్ రాఠీ ఇంటి గేటుపై ఈ నోటీసును అతికించారు. కోర్టు సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుడు స్వయంగా వెళ్లి ఈ సమన్లను జారీ చేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. రాఠీకి నేరుగా అందజేయడానికి వీలుపడకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గేటుపైనే ఈ నోటీసును అంటించి సమాచారం అందించారు.

## పెట్రోల్‌పై పెంపు.. డీజిల్‌పై తగ్గింపు!

- పెట్రోల్ ఎగుమతి సుంకం ఐదు రెట్లు పెంపు
- డీజిల్ సుంకం సగానికి తగ్గింపు
- అర్ధరాత్రి నుంచే కొత్త పన్నులు అమలు
- పెట్రోల్‌పై లీటరుకు రూ.2.50 సుంకం
- డీజిల్‌పై లీటరుకు రూ.8.50కి కోత
- అంతర్జాతీయ ధరల ఆధారంగా సవరణలు
- ప్రతి 15 రోజులకు పన్నుల సమీక్ష

2 లో

## తలాక్‌పై కేంద్రానికి సుప్రీం నోటీసులు!

- తలాక్ పద్ధతులపై సుప్రీం కీలక స్పందన
- కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ
- అన్ని విడాకుల పద్ధతులపై మార్గదర్శకాలు
- ముస్లిం మహిళల హక్కుల పరిరక్షణకు చర్యలు
- ఏకపక్ష విడాకులపై పిటిషన్
- సమానత్వం, ఆత్మగౌరవ హక్కులపై వాదనలు
- కేంద్ర చట్ట మంత్రిత్వ శాఖకు ఆదేశాలు

2 లో

## కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు!



**న్యూస్ డెస్క్, అక్టోబర్ 16 (తెలుగు గళం):** తెలంగాణలో సాగునీటి కొరతపై రాజకీయ దుమారం రేగుతోంది. రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ఇబ్బందులకు ప్రకృతి పరిస్థితులే కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. “ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు” అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కీలక సమయంలో పంపులు ప్రారంభించకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు.

**76 రోజుల ఆలస్యం.. 40 టీఎంసీల నీటిపై ప్రభావం!**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్ పంప్‌హౌస్ వద్ద భారీ సామర్థ్యం కలిగిన పంపులను చూపిస్తూ కేటీఆర్ ఎక్స్‌లో వీడియోను పోస్ట్ చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ఈ ప్రాజెక్టులో ఒక్కో పంపు 145 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

- 76 రోజుల నిర్లక్ష్యం.. 40 టీఎంసీల నష్టం!
- కాలం కాదు.. కాంగ్రెస్ కరువు!
- పంపులు ఆన్ చేయరా.. రైతులను ముంచుతారా?
- 250 టీఎంసీల కృష్ణా జలాలు దిగువకే!
- పాలమూరు ప్రాజెక్టుపై ఎందుకీ నిర్లక్ష్యం?
- కేసీఆర్‌పై కక్షతో రైతులకు శిక్షా?
- కన్నెపల్లి, దేవాదులపై అలసత్వం!
- ఎల్‌నినో హెచ్చరికలు బేఖాతరా?
- తెలంగాణలో కరువు.. ఏపీకి నీళ్లు!

కేసీఆర్ హయాంలో నిర్మించిన ఈ ప్రాజెక్టులో ఒక్కో పంపు 145 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

మిగతాది 2 లో..

## పాక్ నుంచి వచ్చారు.. భారతీయులయ్యారు!



2 లో

**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** పాకిస్థాన్ నుంచి వలస వచ్చి గుజరాత్‌లో తలదాచుకున్న 319 మందికి ఎట్టకేలకు భారతీయ పౌరసత్వం లభించింది. ఏళ్ల తరబడి పడిన నిరీక్షణ ఫలించడంతో ఆ కుటుంబాలన్నీ తమ జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ లబ్ధిదారులకు పౌరసత్వ ధ్రువపత్రాలను అందజేశారు. రాజ్‌కోట్‌లోని ప్రముఖ స్వామి ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకలో చాలామంది భావోద్వేగానికి గురయ్యారు. పౌరసత్వం వచ్చినట్లు ప్రకటించగానే వారి కళ్లలో ఆనందబాష్పాలు రాలాయి.

## పోటీకి భయపడం.. రండి చూసుకుందాం!

- మస్క్‌కు జియో స్ట్రాంగ్ కౌంటర్
- స్టార్‌లింక్‌కు జియో స్వాగతం
- భారత చట్టాలకు కట్టుబడాల్సిందే
- పదేళ్లలో 53 కోట్లకు పైగా జియో వినియోగదారులు
- చౌకైన డేటాతో డిజిటల్ విప్లవం
- శాటిలైట్ రంగంలో గుత్తాధిపత్యానికి చెక్
- ప్రభుత్వ అనుమతుల కోసం జియో ఎదురుచూపులు



2 లో

**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** అమెరికా కుబేరుడు ఎలోన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ ‘స్టార్‌లింక్’ భారత్‌లోకి ప్రవేశించడంపై గత కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో భారత టెలికాం మార్కెట్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్లో పోటీని ఆహ్వానిస్తున్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఇందులో స్టార్‌లింక్ కూడా భాగమేనని పేర్కొంది. అయితే, ఈ రంగంలోకి వచ్చే ప్రతి సంస్థ దేశీయ చట్టాలు, ప్రస్తుత నిబంధనలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పింది. భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి ఇక్కడి కొందరు వ్యాపారవేత్తలు, కార్పొరేట్ శక్తులు అడ్డుపడుతున్నాయంటూ మస్క్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## రాయచోటిలో రాజకీయ రగడ!



2 లో

**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయంపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో పాటు వైసీపీ కార్యాలయం, అక్కడ ఉన్న వాహనాలకు టీడీపీ కార్యకర్తలు నిప్పు పెట్టారు.

## ఏపీలో మున్సిపల్ ఎన్నికల నగారా



2 లో

- నామినేషన్లకు మూడు రోజులే గడువు
- 3,942 స్థానాలకు ఎన్నికల పోరు
- 5,485 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణ
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు అవకాశం
- ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన
- 21 వరకు ఉపసంహరణకు గడువు
- 28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు

# తలాక్‌పై కేంద్రానికి సుప్రీం నోటీసులు!



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** ముస్లిం సమాజంలో ప్రస్తుతం అమల్లో ఉన్న అన్ని రకాల విడాకుల పద్ధతులు, ఇతర వైవాహిక రద్దు రూపాలపై స్పష్టమైన చట్టబద్ధమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం స్పందించింది. అయితే, సదరు పిటిషన్‌పై తమ నివేదికను కౌంటర్‌లా దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం ఇవాళ నోటీసులు జారీ చేసింది.

ముస్లిం పర్సనల్ లా కింద అమల్లో ఉన్న వివిధ రకాల తలాక్ పద్ధతులు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు, ముఖ్యంగా మహిళల ఆత్మగౌరవం, సమానత్వపు హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పలుమార్లు తలాక్ ను ఇప్పటికే సుప్రీంకోర్టు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ నిషేధించినప్పటికీ, ఇతర రకాల ఏకపక్ష విడాకుల పద్ధతులు ఇంకా అమల్లో ఉన్నాయని, వీటిని క్రమబద్ధీకరించడానికి, నియంత్రించడానికి యునిఫాం గైడ్‌లైన్స్ అవసరమని పిటిషనర్ కోరింది. ఈ క్రమంలోనే చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం సదరు పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ, ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను పరిరక్షించేలా, అన్ని రకాల విడాకుల ప్రక్రియలో న్యాయమైన విధానం అమలయ్యేలా గైడ్‌లైన్స్ రూపొందించే అంశంపై కేంద్ర చట్ట మంత్రిత్వ శాఖ తమ స్పందన తెలియజేయాలని నోటీసుల ద్వారా కోరింది.

# ఎన్‌డీఎంసీ ఆంక్షలపై సుప్రీం హెచ్చరిక!



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** కాక్రోచ్ జనతా పార్టీ 'తిరంగా నిరసన' నేపథ్యంలో న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌లను మూసివేయడంపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. తాజా నిర్ణయం వల్ల వ్యాపారులకు చట్టవిరుద్ధంగా నష్టం వాటిల్లినట్లు తెలిస్తే, రాజ్యాంగ పరిహార అధికారాలను ఉపయోగించి కఠిన చర్యలు తీసుకుంటామని అత్యున్నత ధర్మాసనం స్పష్టం చేసింది.

**రూ.200 కోట్ల వ్యాపార నష్టం.. వర్తకుల ఆందోళన**

కనాట్ ప్లేస్, సెంట్రల్ పార్క్‌ల మూసివేతపై ఢిల్లీ కిరాణా కమిటీ, ఢిల్లీ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్ అసోసియేషన్ తరఫున అడ్వకేట్ జై అనంత్ దేహద్రాయ్ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. దసరా పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ సెంట్రల్ పార్క్‌లో నిరసనలు, ఎన్‌డీఎంసీ విధించిన ఆంక్షల వల్ల రోజుకు దాదాపు రూ.200 కోట్ల మేర వ్యాపార లావాదేవీలకు విఘాతం కలుగుతుందని, ఇది చిన్న వ్యాపారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**సుప్రీంకోర్టు ధర్మాసనం రియాక్షన్ ఇదే..**

ఈ క్రమంలోనే జై అనంత్ దేహద్రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ లతో కూడిన ధర్మాసనం ఇవా విచారణ చేపట్టింది. వాదనల వేళ సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. అందరికీ సద్బుద్ధి కలుగుతుందని ఆశిస్తున్నాం. పండుగ రోజుల్లో చిన్న షాపుల యజమానులు తమ జీవనోపాధిని పొందుతారని మాకు తెలుసు. ఇలాంటి సమయంలో వ్యాపారాలకు అంతరాయం కలిగితే ఆ కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు, ఇబ్బందులు మాకు అర్థమవుతాయని కామెంట్ చేశారు. ఇదే అంశంపై జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ కూడా రియాక్ట్ అయ్యారు. ఒకవేళ ఎన్‌డీఎంసీ విధించిన ఆంక్షలు దామాషాకు మించి ఉన్నాయని, వ్యాపారులకు అక్రమంగా నష్టం కలిగిందని కోర్టు భావిస్తే.. రాజ్యాంగ పరిహార నియమాల ప్రకారం నష్టపరిహారం ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దసరా సెలవుల అనంతరం కేసులో తదుపరి విచారణను అక్టోబర్ 26కు కోర్టు వాయిదా వేసింది.

# రాహుల్‌పై ఆరోపణలు.. సుప్రీం కీలక వ్యాఖ్యలు!



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** లోక్‌సభా పక్షనేత, కాంగ్రెస్ లీడర్ రాహుల్ గాంధీ పై వచ్చిన ఆరోపణల వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పందించింది. ఈ నెల 12న ఎన్నికల సంఘంపై పిటిషన్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లిన సమయంలో రాహుల్ గాంధీ తోపులాటలో పలువురిని నెట్టివేశారనే ఆరోపణలు వెలుగుచూశాయి. ముఖ్యంగా, గర్భిణిగా ఉన్న మహిళా జర్నలిస్టు రిచా పరాశరను కూడా ఆయన నెట్టివేశారంటూ బీజేపీ నేత గౌరవ్ భాటియా ప్రధానంగా సీజేఐ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

**మౌఖిక ఆరోపణలు వద్దు.. పిటిషన్ దాఖలు చేయండి**

అయితే, ఈ అంశంపై కోర్టులో ప్రస్తావన రాగా.. కేవలం మౌఖికంగా చెప్పే విషయాలను తాము పరిగణనలోకి తీసుకోలేమని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని సరైన వివరాలు, ఆధారాలతో అధికారికంగా పిటిషన్ దాఖలు చేస్తే, దానిపై విచారణ చేపట్టడాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ధ్రువ్ రాఠీపై క్రిమినల్ కేసు!



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి పరువు నష్టం కేసులో ఇబ్బందులు మరింత పెరిగాయి. గురుగ్రామ్‌లోని ఇంటి ప్రధాన గేటుపై ఢిల్లీ సాకేత్ కోర్టు సమన్లను అంటించారు. బీజేపీ ఐటీ సెల్ సభ్యుడు వికాస్ సాకృత్యాయన్ అలియాస్ వికాస్ పాండే దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసుకు సంబంధించి ఈ పరిణామం చోటుచేసుకుంది. గురుగ్రామ్‌లోని సెక్టార్–56 లో ఉన్న కేంద్రీయ విహార్ సొసైటీలో ఉన్న ధ్రువ్ రాఠీ ఇంటి గేటుపై ఈ నోటీసును అతికించారు. కోర్టు సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుడు స్వయంగా వెళ్లి ఈ సమన్లను జారీ చేసేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. రాఠీకి నేరుగా అందజేయడానికి వీలుపడకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు ఇంటి గేటుపైనే ఈ నోటీసును అంటించి సమాచారం అందించారు. ఈ వివాదం మూలాలు 2018 నాటి ఓ వీడియోలో ఉన్నాయి. 'బీజేపీ ఐటీ సెల్ పార్ట్–2' పేరుతో అప్పట్లో అప్‌లోడ్ చేసిన ఆ వీడియోలో తమపై, బీజేపీ ఐటీ సెల్ పై నిరాధార ఆరోపణలు చేశారని వికాస్ పాండే ఫిర్యాదులో పేర్కొన్నారు. వికాస్ పాండే ద్వారా మహావీర్ ప్రసాద్ అనే వ్యక్తికి లంచం ఇవ్వడానికి ప్రయత్నించారని, అంతేకాకుండా ధ్రువ్ రాఠీని బద్నాం చేయడానికి రూ.50 లక్షలు ఆశ చూపారంటూ ఆ వీడియోలో తప్పుడు ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ నిరాధార ఆరోపణలు తన వ్యక్తిగత, సామాజిక ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించాయని వికాస్ పాండే తెలిపారు. 2019 జూలైలోనే ఈ కేసుకు సంబంధించి మొదటిసారి సమన్లు జారీ అయినప్పటికీ, ఇప్పటివరకు అవి ఆయనకు అందలేదు. ధ్రువ్ రాఠీ ఆస్ట్రియాలో నివసిస్తుండటం, నోటీసులు తీసుకోవడానికి నిరాకరించడమే ఇందుకు కారణం. అయితే, ఆయన ప్రస్తుతం భారత్‌లోని ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లోనే ఉన్నట్లు సమాచారం అందడంతో కోర్టు తాజాగా మరోసారి సమన్లు జారీ చేసింది. మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని సెంట్రల్ పార్క్‌లో జెండా వందన నిరసన కార్యక్రమం చర్చనీయాంశంగా మారగా, ఈ కార్యక్రమంలో ధ్రువ్ రాఠీ కూడా పాల్గొంటారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలన్నింటి మధ్య, ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ అక్టోబర్ 17న జరగనుండటంతో అందరి దృష్టి కోర్టు తీర్పుపైనే నిలిచింది.

# పెట్రోల్‌పై పెంపు.. డీజిల్‌పై తగ్గింపు!



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** దేశీయంగా ఇంధన ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతి సుంకాన్ని భారీగా పెంచగా.. డీజిల్ ఎగుమతిపై విధిస్తున్న సుంకాన్ని భారీగా తగ్గించింది. ఈ కొత్త సవరించిన పన్నులు ఇవాళ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చినట్లుగా ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. లీటర్ పెట్రోల్‌పై ఎక్స్‌పోర్ట్ డ్యూటీని రూ.0.50 పైసల నుంచి ఏకంగా రూ.2.50కి అంటే ఐదు రెట్లు పెంచారు. ఇక లీటరు డీజిల్‌పై ఎక్స్‌పోర్టు డ్యూటీని రూ.16 నుంచి ఏకంగా రూ.8.50కి అంటే సగానికి తగ్గించారు.

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల్లో వస్తున్న హెచ్చుతగ్గులకు అనుగుణంగా ప్రతీ 15 రోజులకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను సమీక్షించి సవరిస్తుంటుంది. అంతర్జాతీయ ధరల సరళికి అనుగుణంగానే ఈ తాజా మార్పులు చేసినట్లుగా తెలుస్తోంది. అయయితే, ఆయిల్ రిఫైనరీలు విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేయడం ద్వారా అధిక లాభాలు గడించకుండా నియంత్రించేందుకు భారత్ మొదటిసారిగా 2022 జూలైలో ఈ విండ్‌ఫాల్ పన్నులను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

# రాయచోటిలో రాజకీయ రగడ!

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఇరు వర్గాలను చెదరగొట్టారు.

రాయచోటిలోని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కార్యాలయం వద్దకు చేరుకున్న టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో దాడి చేస్తూ బీభత్సం సృష్టించారు. ఈ క్రమంలో సుమారు 10 వాహనాలకు నిప్పు పెట్టారు. ఆపై వైసీపీ కార్యాలయంకు నిప్పు పెట్టారు. మంటలు భారీగా ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. దాడి జరిగిన సమయంలో శ్రీకాంత్ రెడ్డి వైసీపీ కార్యాలయంలోనే ఉన్నారు. ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ పరిణామాలతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దాడి నేపథ్యంలో కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తోంది.

ఘటనను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కూడా టీడీపీ శ్రేణులు దాడి చేశాయి. దాడి భయంతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ముందుకు రావడం లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఏపీలో మున్సిపల్ ఎన్నికల నగారా



**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులతో పాటు 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,485 కేంద్రాల్లో నామినేషన్ పత్రాలను స్వీకరించనున్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు నామినేషన్లను స్వీకరించనున్నారు. అభ్యర్థులు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమ నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చు. నామినేషన్ పత్రాల పరిశీలన ఈ నెల 19న జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21 వరకు అవకాశం కల్పించారు. అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ అనంతరం ఈ నెల 30న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల సందడి మొదలైంది.

# పాక్ నుంచి వచ్చారు.. భారతీయులయ్యారు!

మొదటి పేజీ తరువాయి

"నవ్వుకోండి, ఇకపై మీరందరూ అధికారికంగా భారతీయులే" అంటూ డిప్యూటీ సీఎం వారికి అభినందనలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న కీలక నిర్ణయం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వల్లే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా శరణార్థుల జీవితాల్లో భద్రత, ఆశలు చిగురించాయని హర్ష్ సంఘ్వీ తెలిపారు. పాకిస్థాన్‌లో హిందూ కుటుంబాలు, ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కాదన్నారు. పాక్‌లోని థార్‌పార్కర్ ప్రాంతం నుంచి భారత్‌కు వచ్చిన ఎంతోమంది మహిళలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి పేర్లు కూడా మార్చుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు భారతీయ పౌరసత్వం రావడంతో వారు ఎవరికీ భయపడకుండా తమ అసలు పేర్లతో ఆత్మగౌరవంతో బతకవచ్చని చెప్పారు. పౌరసత్వం పొందిన 319 మందిలో రాజ్‌కోట్ జిల్లాకు చెందిన వారు 259 మంది ఉండగా, మోర్బీ నుంచి 53 మంది, కచ్ నుంచి 6 మంది, సురేంద్రనగర్ నుంచి ఒకరు ఉన్నారు. పాకిస్థాన్ పాస్‌పోర్ట్ కంటే.. రాజ్‌కోట్ గర్బా ఉత్సవాల్లో పాల్గొనేందుకు లభించే అనుమతి పత్రమే తనకు ఎంతో విలువైనదని ఈ సందర్భంగా హర్ష్ సంఘ్వీ వ్యాఖ్యానించారు. దేశంలో స్థిరమైన గుర్తింపు, రక్షణ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ కుటుంబాలకు ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనది. పౌరసత్వం దక్కడంపై వారు స్పందిస్తూ.. ఇది తమ కల నిజమైన క్షణమని చెప్పారు. ఇకపై తమకంటూ ఆధార్ కార్డు, ఓటరు ఐడీ వస్తాయని, రాబోయే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఇల్లు కొనుగోలు చేయడానికి బ్యాంకుల్లో రుణాలు కూడా పొందవచ్చని సంతోషంగా తెలిపారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత అభ్యర్థి!

**న్యూస్ డెస్క్, 16 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనబెట్టి కేవలం రాజకీయాలకే పరిమితమయ్యారని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాబోయే రోజుల్లో వరుసగా 7 నుంచి 8 నెలల పాటు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని కవిత స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన క్షేత్రస్థాయిలో పోరాడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఒప్పందాల్లో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీలే ఎక్కువగా ఉన్నాయని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నిర్వహించే 'గ్లోబల్ సమ్మిట్'ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

మేడిగడ్డను పూర్తి చేయాలి..: సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించిన కవిత, మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖైరతాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన తరఫున అత్యంత బలమైన అభ్యర్థిని బరిలోకి దించుతామని, దసరా పండుగ రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న నిరసనలన్నీ డ్రామా అని, అవన్నీ కేవలం "ఫేక్ నిరసనలు" అని కవిత కొట్టిపారేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత పెరగాలంటే రాబోయే ఎన్నికలన్నీ ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్ ద్వారానే నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు.

# పోటీకి భయపడం.. రండి చూసుకుందాం!

మొదటి పేజీ తరువాయి

అలాగే ముకేశ్ అంబానీని ఉద్దేశిస్తూ భారత టెలికాం రంగంలో పోటీ తత్వంపై ప్రశ్నలు గుప్పించారు. మస్క్ ఆరోపణల నేపథ్యంలో రిలయన్స్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసింది. "మేము ఎప్పుడూ పోటీకి భయపడలేదు. వినియోగదారులకు ఎవరు అత్యుత్తమ సేవలను అందిస్తున్నారో నిరూపించుకోవడానికి పోటీనే అతిపెద్ద పరీక్షగా మేము భావిస్తాం" అని తెలిపింది.

తన టెలికాం విభాగమైన 'జియో ప్లాట్‌ఫార్మ్స్' ప్రయాణాన్ని రిలయన్స్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. 2016లో జియో సేవలు ప్రారంభించినప్పుడు తమకు ఒక్క కస్టమర్ కూడా లేరని, కానీ కేవలం పదేళ్ల కాలంలో జియో వినియోగదారుల సంఖ్య 53 కోట్లకు పైగా పెరిగిందని వెల్లడించింది. భారతీయ పౌరులకు మెరుగైన డిజిటల్ సేవలతో పాటు ప్రపంచంలోనే అత్యంత చవకైన మొబైల్ డేటాను అందుబాటులోకి తీసుకురావడంలో జియో కీలక పాత్ర పోషించిందని కంపెనీ పేర్కొంది. స్టార్‌లింక్‌తో పాటు శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలోకి వచ్చే అన్ని కంపెనీలను తాము ఆహ్వానిస్తున్నామని చెప్పిన రిలయన్స్.. జియోతో సహా ప్రతి ఒక్కరూ భారతీయుల ప్రయోజనాల కోసం, దేశ చట్టాలు, విధానాలకు లోబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత్‌లో స్వదేశీ, విదేశీ పెట్టుబడులకు, కొత్త ప్రయోగాలకు ఎప్పుడూ స్వాగతం ఉంటుందని, అయితే ఇదంతా చట్ట పరిధిలోనే జరగాలని వివరించింది.

మరోవైపు, శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి కంపెనీకి ఒకే రకమైన నిబంధనలు, ప్రక్రియలు వర్తిస్తాయని భారత ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. తమ సొంత శాటిలైట్ నెట్‌వర్క్ సేవలకు సంబంధించి జియో కూడా ప్రస్తుతం ప్రభుత్వ అనుమతుల కోసమే వేచి చూస్తోందని రిలయన్స్ ఈ సందర్భంగా వెల్లడించింది. భారత్‌లో స్టార్‌లింక్ సేవలు ప్రారంభించడానికి సన్నాహాలు చేసుకుంటున్న వేళ రిలయన్స్ చేసిన ఈ ప్రకటన టెలికాం వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో ఏ ఒక్కరి గుత్తాధిపత్యానికి తావులేదని ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే.

# డీలిమిటేషన్‌పై కేంద్రం ఫోకస్!

మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు ఆ పరిణామం జరిగిన కొన్ని నెలల తర్వాత ప్రభుత్వం మళ్లీ ఈ దిశగా అడుగులు వేస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లు నెగ్గాలంటే పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ (స్పెషల్ మెజారిటీ) తప్పనిసరి. ప్రస్తుత లోక్‌సభలో ఎన్డీయే కూటమికి సాధారణ మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు కావాల్సిన మూడింట రెండు వంతుల మెజారిటీకి కొన్ని సీట్లు తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం లోక్‌సభలో 540 మంది సభ్యులు ఉండగా, బిల్లు ఆమోదానికి దాదాపు 360 సీట్ల మద్దతు అవసరం. అయితే గత సమావేశాలతో పోలిస్తే ఇప్పుడు ప్రభుత్వ బలం కొంత పెరిగింది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యుబిటి)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపునకు మారడంతో ప్రభుత్వ స్థానం మరింత బలపడింది. ఈ బిల్లులకు మద్దతు పొందడం కోసం కేంద్ర ప్రభుత్వం ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎమ్‌కె)తో కూడా చర్చలు జరుపుతోందని సమాచారం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో విభేదించి, 'ఇండియా' కూటమి నుంచి డిఎమ్‌కె బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతీయ పార్టీ మద్దతును కూడగట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. ఓటింగ్ నాటికి తమ వైపు సంఖ్యను మరింత పెంచుకునేందుకు కొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతో కూడా ప్రభుత్వం టచ్‌లో ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ (రద్దు) కాకపోవడం గమనార్హం. దీనివల్ల ప్రత్యేక సమావేశాలను తక్షణమే ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి సులువుగా మార్గం సుగమమైంది. ఇక, ఈ నెల 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో 12వ బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా (బ్రిక్స్) పార్లమెంటరీ ఫోరమ్ జరగాల్సి ఉంది. ఈ సమావేశాల తేదీలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తేదీలను ఆఖరిగా ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ ప్రత్యేక సమావేశాలను ప్రారంభించడానికి ముందు కనీసం ఒక వారం రోజుల ముందే నోటీసు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

## కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు!

మొదటి పేజీ తరువాయి

శ్రీశైలం జలాశయానికి జూలై 29 నుంచి వరద ప్రవాహాలు ప్రారంభమైనప్పటికీ, రేవంత్ ప్రభుత్వం సుమారు 76 రోజుల పాటు పంపులను ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు డిమాండ్ చేసిన తర్వాతే పంపింగ్ ప్రారంభించారని విమర్శించారు.

వరదలు వచ్చినప్పటి నుంచే పంపింగ్ చేపట్టి ఉంటే సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉండేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ నీటితో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వీలుండేదని తెలిపారు. అయితే, కేసీఆర్‌కు రాజకీయంగా పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ప్రాజెక్టును సకాలంలో వినియోగించలేదని ఆయన ఆరోపించారు. ఈ జాప్యం వల్లే రైతులు ప్రస్తుతం సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

**దిగువకు వందల టీఎంసీల నీరు.. కేటీఆర్ ఆరోపణలు**

2026 జూన్ 1 నుంచి ఇప్పటివరకు గోదావరి నుంచి 50 టీఎంసీలకు పైగా, కృష్ణా నది నుంచి 250 టీఎంసీల నీటిని కాంగ్రెస్ ప్రభుత్వం దిగువకు విడిచిపెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. ఈ నీటిని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలున్నప్పటికీ ప్రభుత్వం సరైన ప్రణాళికతో వ్యవహరించలేదని విమర్శించారు. కీలకమైన సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను సమర్థంగా వినియోగించి ఉంటే రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపడంతో పాటు రైతులకు నీటిని అందించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

**కన్నెపల్లి, దేవాదులపై నిర్లక్ష్యమా?**

గోదావరి జలాలను వినియోగించుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించి ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉండేదని అన్నారు. మరోవైపు, పాలమూరు––రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పంపులను సకాలంలో ప్రారంభించకపోవడంతో కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకోలేకపోయారని ఆరోపించారు. నీటి లభ్యత ఉన్న సమయంలోనే సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ దిశగా వ్యవహరించలేదని మండిపడ్డారు.

**ఎల్‌నినో హెచ్చరికలను పట్టించుకోలేదా?**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, వ్యవసాయ పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యత, వర్షాల పరిస్థితులు, సాగు అవసరాలను సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టులను నిర్వహించాల్సి ఉండగా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి జలవనరుల వినియోగంపై ప్రణాళిక రూపొందించి ఉంటే రైతులకు కొంత ఉపశమనం కలిగేదని అభిప్రాయపడ్డారు.

**తెలంగాణ నీళ్లు ఏపీకి.. కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**

తెలంగాణ ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తన అవసరాలకు వినియోగించుకుందని కేటీఆర్ ఆరోపించారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, పోతిరెడ్డిపాడు, వెలిగొండ టన్నెల్ మార్గాల ద్వారా కృష్ణా జలాలను తరలించుకెళ్లిందని పేర్కొన్నారు. కుప్పం ప్రాంతానికి సైతం నీటిని అందించే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలోని రైతులకు సాగునీటి కొరత ఎదురవుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నీటి వినియోగంపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిందని అన్నారు.

**రైతుల కష్టాలకు బాధ్యత ఎవరిది?**

ప్రాజెక్టులు నిర్మించడం మాత్రమే కాకుండా, సరైన సమయంలో వాటిని వినియోగించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. జలాశయాల్లోకి వరదలు వచ్చినప్పుడు నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకోవడం, రిజర్వాయర్లు, చెరువులను నింపడం, సాగుకు అవసరమైన నీటిని ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయడం కీలకమని పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

## అర్హులైన కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి




**మీడియా అకాడమీ చైర్మన్, ఐ అండ్ పీఆర్ కమిషనర్‌కు వినతి పత్రం**

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ అక్టోబర్ 16

తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ టీవీ ఛానళ్లలో పనిచేస్తున్న అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ హడాక్ కమిటీ, టీయూడబ్ల్యూజే నాయకులు మామిడి సోమయ్య, కేబుల్ ఛానల్ ఓనర్స్ ప్రతినిధులు మీడియా అకాడమీ చైర్మన్, సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణలో కేబుల్ టీవీ ఛానళ్లు స్థానిక వార్తలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రతినిధులు పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల పర్యటనలు, స్థానిక సంస్థల కార్యకలాపాలను ప్రజలకు చేరవేస్తున్నాయని తెలిపారు.రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, రైతులు, కార్మికులకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో వెలుగులోకి తీసుకువస్తూ కేబుల్ ఛానల్ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని వివరించారు.ఇంతటి కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అర్హత కలిగిన కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జాప్యం జరగడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతినిధులు అధికారులకు వివరించారు. జర్నలిస్టుల వృత్తిపరమైన అనుభవం, సంబంధిత మీడియా సంస్థల వివరాలు, ప్రభుత్వం నిర్దేశించిన అర్హత ప్రమాణాలను పరిశీలించి, అర్హులైన వారికి కార్డులు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అక్రిడిటేషన్ అనేది జర్నలిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కల్పించే అధికారిక గుర్తింపులో భాగమని, ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక సమావేశాలు, ప్రజా సమస్యలకు సంబంధించిన వార్తల కవరేజీలో ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టుల అర్హతలను కూడా నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకుని, వారి వృత్తిపరమైన సేవలకు తగిన గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.మీడియా అకాడమీ చైర్మన్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర సమస్యలను సమగ్రంగా పరిశీలించాలని ప్రతినిధులు కోరారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు ఎలాంటి అనవసర జాప్యం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, నునుమస శుభాష్ గౌడ్, భరత్ కుమార్, రవికుమార్, రాయపర్తి భానుప్రసాద్, పిట్ల ప్రతాప్, ఎం. కృష్ణ ప్రసాద్, బ్రహ్మం, కుమార్, గిరిబాబు, కళ్యాణ్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 59 ఏళ్లు పైబడిన చేనేత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పథకాన్ని పునరుద్ధరించాలి

- జీవోను తిరిగి అమలు చేసి వృద్ధ చేనేత కార్మికులను ఆదుకోవాలి
-- బిర్రు ఇస్తారి విజ్ఞప్తి

తెలుగు గళం న్యూస్ జనగామ అక్టోబర్ 16

59 సంవత్సరాలు పైబడిన చేనేత కార్మికులకు గతంలో ప్రభుత్వం అందజేసిన ఎక్స్‌గ్రేషియా పథకాన్ని పునరుద్ధరించి, తిరిగి అమలు చేయాలని చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బిర్రు ఇస్తారి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బిర్రు ఇస్తారి మాట్లాడుతూ, చేనేత వృత్తినే జీవనాధారంగా చేసుకొని జీవితాంతం శ్రమించిన కార్మికులు వృద్ధాప్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా 59 సంవత్సరాలు పైబడిన కార్మికులు వయోభారం, అనారోగ్య సమస్యలు, ఉపాధి అవకాశాల కొరతతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.గతంలో అమలులో ఉన్న ఎక్స్‌గ్రేషియా పథకం అనేక చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న చేనేత కార్మికులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవోను పునరుద్ధరించి, పథకాన్ని తిరిగి ప్రారంభించడం ద్వారా అర్హులైన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు.చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వడంతో



పాటు, చేనేత సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా చేనేత వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.కావున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేనేత కార్మికుల దీనస్థితిని పరిగణనలోకి తీసుకొని, ఎక్స్‌గ్రేషియా పథకం జీవోను పునరుద్ధరించి, పథకాన్ని తిరిగి ప్రారంభించాలని బిర్రు ఇస్తారి చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వృద్ధ చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు.

## ఉద్యమ కేసులో జేఏసీ నాయకులకు ఊరట

- రెండో కేసును కొట్టివేసిన స్టేషన్ ఘన్‌పూర్ కోర్టు




తెలుగు గళం ,జాఫర్‌గడ్ అక్టోబర్ 16

వరంగల్ జిల్లా ఉద్యమ సమయంలో నమోదైన కేసుల్లో రెండో కేసును స్టేషన్ ఘన్‌పూర్ కోర్టు కొట్టివేయడంతో జేఏసీ నాయకులకు ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి జేఏసీ నాయకులు కోర్టుకు హాజరయ్యారని జాఫర్‌గడ్ మండల జేఏసీ కన్వీనర్ బానోత్ రాజేష్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన సమయంలో జాఫర్‌గడ్ మండలాన్ని వరంగల్ జిల్లా నుంచి విడదీసి జనగామ జిల్లాలో కలిపారని గుర్తుచేశారు.ఈ నిర్ణయం మండల అభివృద్ధి, విద్యా అవకాశాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళనతో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఐక్యంగా జేఏసీగా ఏర్పడి ఉద్యమం చేపట్టినట్లు వివరించారు.జాఫర్‌గడ్ మండలాన్ని తిరిగి వరంగల్ జిల్లాలో కలపాలనే డిమాండ్‌తో రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు నిర్వహించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమం చేసిన నాయకులు, మహిళలతో సహా పలువురిపై కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు.ఉద్యమ సమయంలో నమోదైన కేసులకు సంబంధించి న్యాయపోరాటం కొనసాగించామని పేర్కొన్నారు.మండల ప్రజల చిరకాల కోరికను నెరవేర్చేందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. జాఫర్‌గడ్ మండలాన్ని తిరిగి హన్మకొండ జిల్లాలో కలిపే అంశంపై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల ప్రజల భవిష్యత్తు, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించాలని కోరారు.ఈ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరైన వారిలో జేఏసీ మండల కన్వీనర్ బానోత్ రాజేష్ నాయక్‌తో పాటు అన్నెబోయిన బిక్షపతి, కుల్ల మోహన్ రావు, రాపర్తి రాజు, ఎడ్ల వెంకటస్వామి, పట్టపురి సదయ్య గౌడ్, తాటికాయల రాజేందర్, కాట సుధాకర్, జువారీ రమేష్, ఎండీ హబీబ్ ఖాన్, ఇల్లందల బాబు, రాపర్తి యాకయ్య, చిట్టీమల్లె కృష్ణమూర్తి, జెట్టి రవికుమార్, సోమిరెడ్డి, వాసం రమేష్, చావనబోయిన సోమనర్సయ్య, కుక్కల సారంగం, కూరపాటి విజయ్, కాట కృష్ణ, కుల్ల కార్తీక్ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి పండుగ కానుకగా నూతన దుస్తుల పంపిణీ



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో ఏడవ రోజు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన నూతన దుస్తుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు రామచంద్రనాయక్ మున్సిపల్ సిబ్బందికి నూతన దుస్తుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బందికి దుస్తులను అందజేశారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఎండా, వానా అనే తేడా లేకుండా ప్రజారోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తున్న కార్మికుల సేవలను గుర్తించి, దసరా పండుగ సందర్భంగా వారికి నూతన వస్త్రాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, కమిషనర్ నరేష్ రెడ్డి, కౌన్సిలర్లు, గంట్ల గౌతమ్ రెడ్డి, జాటోత్ సురేష్ నాయక్,మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజార్ కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించాలి.!

- రైతు బజార్ల రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఐఏఎస్ ఆఫీసర్ మాధవి లత..



తెలుగుగళం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 16: కడప జిల్లా.. బద్వేల్ పట్టణంలోని రైతు బజార్‌ను రైతు బజార్ల రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాధవి లత, ఐఏఎస్. బద్వేల్ పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, రైతులు, వ్యాపారులు మరియు వినియోగ దారులతో మాధవి లత మాట్లాడుతూ.. రైతులు మరియు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా పొందుతున్న ప్రయోజనాలు, రైతు బజార్‌లో కల్పిస్తున్న సౌకర్యాలు, కూరగాయల విక్రయాలు మరియు ధరల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాధవి లత స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతు బజార్ కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్డిఓ చంద్ర మోహన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమతి సుప్రజ సంబంధిత అధికారులు, రైతు బజార్ సిబ్బంది, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

## నాలుగో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

- మోకాళ్లపై నిలబడి నిరసన.. రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్
- సమాన పనికి సమాన వేతనం కల్పించాలి: ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్




వరంగల్, అక్టోబర్ 16 (తెలుగు గళం): ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమ బద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద శుక్రవారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరుకోగా,ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ,వారికి తగిన గుర్తింపు, హక్కులు లభించడం లేదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ప్రతి ఉద్యోగికి ఆరోగ్య బీమా, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు, ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి జాన్‌పాల్, ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర కార్యవర్గ నాయకులు డాక్టర్ టి. భరత్ కుమార్, డాక్టర్ రమ్య, డాక్టర్ యశస్విని, ఆచంట అభిషేక్, మెరుగు అనిల్ కుమార్, సంజీవ్, తీగల సతీష్ కుమార్, నర్సింగ్ అధికారులు మంజుల, వాణి, ఏఎన్ఎంలు, ఇతర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

## మూడో వార్డులో స్ట్రీట్ లైట్ల సమస్యకు పరిష్కారం

**21 లైట్లకు మరమ్మతులు..కొత్తగా 5 లైట్ల ఏర్పాటు**

తెలుగు గళం, జనగామ
అక్టోబర్ 16



మూడో వార్డు పరిధిలో వీధి దీపాల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్ఎంఆర్ గార్డెన్స్ ఏరియా, సమ్మక్క--సారలమ్మ వైన్స్ రోడ్డు, జీఎంఆర్ కాలనీ, జ్యోతి నగర్ కమాన్, మాసాయి హాస్పిటల్, కెనరా బ్యాంక్ వెనుక భాగంలోని బైరగోని రాజయ్య ఇంటి ప్రాంతాలతో పాటు పలు కాలనీల్లో గత రెండు రోజులుగా 21 స్ట్రీట్ లైట్లకు మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా కొత్తగా 5 లైట్లను విద్యుత్ స్తంభాలకు అమర్చారు. వీధి దీపాలు క్రమబద్ధంగా వెలిగేలా మూడు ప్రాంతాల్లో టైమర్ బాక్సులను ఏర్పాటు చేశారు.వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, కమిషనర్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు పండుగ సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు.దీంతో సిబ్బంది రంగంలోకి దిగి మరమ్మతులు చేపట్టి, కొత్త లైట్లను ఏర్పాటు చేయడంతో పాటు టైమర్ బాక్సులను అమర్చారు.వెంటనే స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులకు, సిబ్బందికి కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఐడీఓసీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ :ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,కలెక్టర్ రాహుల్ శర్మ**







తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ ఆవరణలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వివిధ రకాల రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా,మహిళా అధికారులు,ఉద్యోగులు బతుకమ్మ పాటలు,ఆటలు,కోలాటాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని,ప్రకృతిని,పూలను,మహిళలను గౌరవించే గొప్ప పండుగ అని అన్నారు.కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతిని భావితరాలకు అందించడంతో పాటు ఉద్యోగుల ఒత్తిడిని తగ్గించేందుకు దోహదపడతాయని తెలిపారు.అనంతరం ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్,మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య,వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,వివిధ శాఖల అధికారులు,మహిళా ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష

**తెలుగు గళం, జనగామ, అక్టోబర్ 16**




జనగామ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వర్యంలో ఈ రోజు బీజేపీ కిసాన్ మోర్చా నిర్వహించిన రైతు నిరసన దీక్షలో పలువురు పార్టీ నాయకులు, మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ దీక్షలో మైనారిటీ మోర్చా అధ్యక్షుడు ఎండీ వలిపాష, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పందిబోయిన యాదగిరితో పాటు మండల పార్టీ ప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొని రైతుల సమస్యలపై నిర్వహించిన నిరసన కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు.రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిఆర్టీయూ రాష్ట్ర కమిటీలో మరిపెడకు పెద్దపీట

- రాష్ట్రస్థాయి పదవులకు మరిపెడ మండలం నుంచి ఏడుగురు ఏకగ్రీవ ఎన్నిక
- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా దోమల లింగయ్య గౌడ్

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**



జి.యం కన్వెన్షన్ హాల్ నల్గొండ రెండు రోజుల పాటు జరిగిన పిఆర్టీయూ 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మరిపెడ మండలానికి చెందిన ఉపాధ్యాయుల ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పిఆర్టీయూ రాష్ట్ర సంఘ అధ్యక్షులు సుంకరి భిక్షం గౌడ్ తెలిపారు.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా దోమల లింగయ్య గౌడ్,గండి కరుణాకర్ గౌడ్,బయగాని రాంమోహన్,రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అబ్బూరి సునీల్ కుమార్,రాయిపెల్లి యాకయ్య, గుగులోత్ శ్రీధర్,రాష్ట్ర కార్యదర్శిగా బి. దత్తప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్ర శాఖలో తమకు ఉన్నతమైన గౌరవం, బాధ్యతలు లభించడం సంతోషంగా ఉందని తెలిపారు.తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని,విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. సంఘ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు.నూతన రాష్ట్ర బాధ్యులను పిఆర్టీయూ మరిపెడ మండల శాఖ అధ్యక్షులు కీసర రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు అర్జున్ నాయక్,కృష్ణారెడ్డి,గుర్రం వెంకన్న గౌడ్,వెంకటయ్య,గుగులోత్ వెంకన్న,గుండ్ల వెంకన్న,రవి,యాదగిరి, భరత్, విజయ్ కుమార్,జగన్,శ్రీహరి,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ముళ్ల చెట్ల తొలగింపు

- ధూప తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగన్న ఆధ్వర్యంలో యువత సేవా కార్యక్రమం

**తెలుగు గళం పర్వతగిరి, అక్టోబర్ 16**



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం నుంచి ధూప తండాకు వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను ధూప తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగన్న ఆధ్వర్యంలో యువకులు తొలగించారు. రహదారికి ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఇదే రహదారిపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనగా, ఒకరికి కాలు విరిగినట్లు తెలిసింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా నాగన్న చొరవ తీసుకుని, స్థానిక యువకుల సహకారంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, వాహనదారులకు రహదారి స్పష్టంగా కనిపించేలా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధూప తండా యువజన సభ్యులు గుగులోత్ సందీప్, గుగులోత్ తరుణ్, ధర్మసోత్ దినేష్, బానోత్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా

**పీఆర్సీ,డీఏలు,పెండింగ్ బకాయిలు,అదనపు భత్యాలు, సరెండర్ బకాయిల విడుదలకు కృషి**



**తెలుగు గళం న్యూస్ వరంగల్/అక్టోబర్ 16**

పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు.వరంగల్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు కొండా కర్ణాకర్ ఆధ్వర్యంలో పోలీసు సంఘం ప్రతినిధులు సుబేదారి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. పోలీసు సిబ్బందికి రావాల్సిన పీఆర్సీ,డీఏలు,పెండింగ్ బకాయిలు, అదనపు భత్యాలు,సరెండర్ సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది సమస్యలు తనకు తెలుసని,వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.పీఆర్సీ,డీఏలు, బకాయిల విడుదల అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని హామీ ఇచ్చారు.పోలీసు సిబ్బంది సంక్షేమం,వారి కుటుంబాల ఆర్థిక భద్రతపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా కృషి చేస్తానని,వారి న్యాయమైన హక్కుల సాధనకు కట్టుబడి ఉన్నానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు కొండా కర్ణాకర్, నరేష్, మహేందర్ యాదవ్, ప్రవీణ్ కుమార్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయానికి రూ.2 లక్షల వెండి శఠారి బహుకరణ

**స్వామివారి సేవలో వనం ఫణిరాజకుమారి పవిత్ర కానుక**

**తెలుగు గళం న్యూస్ పాలకుర్తి అక్టోబర్ 16**



జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వనం ఫణిరాజకుమారి సుమారు రూ.2 లక్షల విలువైన వెండి శఠారిని బహుకరించారు.స్వామివారి సేవలో భాగంగా భక్తిశ్రద్ధలతో ఈ పవిత్ర కానుకను ఆలయానికి సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.దేవస్థానానికి విలువైన వెండి శఠారిని సమర్పించిన వనం ఫణిరాజకుమారి సేవను ఆలయ అధికారులు, గ్రామ ప్రజలు, భక్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**




రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం రహత్ పథకాన్ని అమలు చేస్తోందని ఆర్టీఓ శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం చెల్పూర్ చౌరస్తాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు అర్హులైన బాధితులు ఈ పథకం ద్వారా ఉచితంగా వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు.ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్,బస్‌స్టాండ్లు,ప్రభుత్వ ఆసుపత్రులు తదితర ప్రాంతాల్లో పోస్టర్లు,బ్యానర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడంలో అన్ని శాఖల సమన్వయం,ప్రజల సహకారం కీలకమని డీఆర్ఎం లక్ష్మణ్ అన్నారు.కార్యక్రమంలో ఏఎంవీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సూరం వీరేందర్ తండ్రి దశదిన కర్మలో పాల్గొన్న ప్రభుత్వ న్యాయవాది బొట్ల సుధాకర్

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**




కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సూరం వీరేందర్ తండ్రి ఓదెలు దశదిన కర్మలో భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ న్యాయవాది బొట్ల సుధాకర్ పాల్గొని నివాళులర్పించారు.ఈ సందర్భంగా సూరం వీరేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రేగొండ మండల మాజీ అధ్యక్షులు ఇప్పకాయల నర్సయ్య,గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి వడ్లకొండ రమేష్ గౌడ్,చిట్యాల మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య,ఓబీసీ సెల్ ఉమ్మడి రేగొండ మండల అధ్యక్షులు పొనుగోటి వీరబ్రహ్మం,ఈర్ల యాకూబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నాయకుడికి రెండోసారి మండల అధ్యక్ష పదవి

**సయ్యద్ హుస్సేన్‌కు ఎంఆర్‌పీఎస్ నాయకుల ఘన సన్మానం**
**ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడు**

**తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), అక్టోబర్ 16:**



ములుగు జిల్లా నూతన వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రెండోసారి నియమితులైన సయ్యద్ హుస్సేన్ ని వెంకటాపురం మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటాపురం మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, కష్టకాలంలో పార్టీని ముందుండి నడిపించిన నాయకుడు సయ్యద్ హుస్సేన్ ని కొనియాడారు. మండలంలోని గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే ప్రజా నాయకుడని అన్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, కార్యకర్తలకు అందించిన సహకారం, ప్రజలతో కొనసాగిస్తున్న అనుబంధానికి గుర్తింపుగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రెండోసారి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం అభినందనీయమని పేర్కొన్నారు. సయ్యద్ హుస్సేన్ నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రెండోసారి మండల అధ్యక్షులుగా నియమితులైన సయ్యద్ హుస్సేన్ కి మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల సీనియర్ ఎంఆర్‌పీఎస్ నాయకులు వేల్పుల మల్లేష్ మాదిగ, సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ, ఎంఎస్‌పీ మండల అధ్యక్షులు కొడాలి సత్యం మాదిగ, ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షులు చెన్నం తిరుపతి మాదిగ, సీనియర్ నాయకులు చెన్నం నరేష్ మాదిగ, ఎంఎస్‌పీ ఉపాధ్యక్షులు కోగిల కన్నయ్య మాదిగ, గుద్దేటి నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి మండపంలోనే మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేత

- చెంచుపల్లి గ్రామ పంచాయతీ వినూత్న కార్యక్రమం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెంచుపల్లి గ్రామ పంచాయతీ వినూత్న కార్యక్రమం చేపట్టింది.పెళ్లి మండపంలోనే వధూవరుల వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేసి,వివాహ ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెల్ల రాము,పంచాయతీ కార్యదర్శి నరేష్,ఉపసర్పంచ్ ఇండ్ల భద్రమ్మ,పంచాయతీ సిబ్బంది రాజు,పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ విధానం ద్వారా ప్రజలకు సమయం ఆదా కావడంతో పాటు ప్రభుత్వ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు.వధూవరుల కు నూతన దాంపత్య జీవితానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# లింగంపల్లి శివాజీ నగర్ లో ఘనంగా దసరా నవరాత్రి వేడుకలు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 16( తెలుగు గళం ) న్యూస్**



శేరిలింగంపల్లి శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని లింగంపల్లి శివాజీ నగర్ లో దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శివాజీ నగర్ పార్కు వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. స్థానిక కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా, శుక్రవారం సరస్వతి దేవి అలంకరణతో పూజలు అందుకున్నారు. శుక్రవారం అమ్మవారి మండపం ఆవరణలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ప్రత్యేక పూజల్లో కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.